క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



సూపరింటెండెంట్ వెంకటరమణకు చెక్కు అందజేస్తున్న నండూరి రామకృష్ణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి రామకృష్ణ స్వామి అనే దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

పోలీసుల వలయంలో ఏయూ ప్రాంగణం

ఏయూ క్యాంపస్: పోలీసుల వలయంలోకి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల వెళ్లింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రక్రియ మొత్తం ఇక్కడే జరుగుతోంది. మరికొద్ది గంటల్లో ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఒకవైపు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు.. మరోవైపు భద్రతాపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కళాశాలల ప్రాంగణంలోకి వచ్చే ప్రతి వ్యక్తిని గుర్తింపు కార్డులు తనిఖీ చేసి లోపలికి పంపుతున్నారు. అదే విధంగా మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపునకు అవసరమైన విధంగా మైదానాలలో పార్కింగ్‌కు సంబంధించిన గుర్తులు వేసే పనిని పోలీసులు దగ్గరుండి చేపట్టారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ప్రాంగణం మొత్తం పోలీసుల నిఘాలో ఉండనుంది.

దైవ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం



గీతాలు ఆలపిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు

డాబాగార్డెన్స్: దైవ నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ తెలిపారు. నగరంలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం నామ సంకీర్తన, భక్తి గీతాలాపన, ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. ముందుగా మందిరంలో వేంచేసిన కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కె. నాగేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, కోల్‌కతా ప్రసాద్ భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిపై నివశిస్తున్న జీవునికి నామ సంకీర్తనతోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. భగవన్నామ సంకీర్తనలు చేస్తూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, శివ, సీతారాం, భక్తులు పాల్గొన్నారు.

కోర్టులో కేసు ఉండగా టోల్‌చార్జీలు ఎలా పెంచుతారు

అగనంపూడి: దేశ అత్యున్నత న్యాయస్థానంలో అగనంపూడి టోల్‌ప్లాజా కేసు నడుస్తుండగా టోల్ చార్జీలు ఎలా పెంచుతారని 87వ వార్డు కార్పొరేటర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ప్రశ్నించారు. టోల్ చార్జీల పెంపునకు నిరసనగా అగనంపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవిషయంలో న్యాయపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, బలిరెడ్డి సత్యనారాయణ, బి.రాజన్‌రాజు, వాకాడ వాసు, అనంతలక్ష్మి, బి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ - 2 సత్తిబాబు



సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

డీసీపీ-2 సత్తిబాబు

అక్కిరెడ్డిపాలెం: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీ- 2 మేకా సత్తిబాబు అన్నారు. గాజువాకలోని ఒక ప్రైవేట్ షాపింగ్ కాంప్లెక్స్‌లో వివిధ పార్టీల నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో ఎన్నికల ప్రక్రియను 90 శాతం వరకు ప్రశాంతంగా జరుపుకొన్నామన్నారు. కౌంటింగ్ సందర్భంగా 144, 30 సెక్షన్‌లు అమలులో ఉంటాయని చెప్పారు. ఈ నెల 6 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కడైన ఎక్కువ మంది గుమిగూడినా, సభలు, ర్యాలీలు నిర్వహించినా, నాయకులు నివాసాల వద్ద సమావేశాలు, సన్మానాలు వంటి కార్యక్రమాలు నిర్వహించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత విజయోత్సవ ర్యాలీలు వంటివి జరపకూడదని చెప్పారు. బాణసంచా కాల్చడం, బాణసంచా నిల్వలు చేయడం నిషేధమన్నారు. డీజేలు వినియోగిస్తే వాటిని స్వాధీనం చేసుకోడమే కాకుండా, వినియోగించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని, రౌడీషీట్ షీట్ తెరుస్తామని హెచ్చరించారు. ఇప్పటికే బైండోవర్ కేసులు ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించి కష్టాలను కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా వ్యవహరించరాదన్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ వినియోగించే వారు జాగ్రత్తగా పోస్టులు పెట్టాలని, పోస్టుల వల్ల ఘర్షణలు జరిగే ప్రమాదం ఉందన్నారు. గెలుపు ఓటములు సహజమని, స్పోర్టీవ్‌గా తీసుకోవాలే తప్పా విధ్వంసాలకు పాల్పడి కష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐలు శ్రీనివాసరావు, శ్రీనివాసు, దాలిబాబు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా పర్యావరణ సైకిల్ ర్యాలీ



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం పర్యావరణ సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టీల్‌ప్లాంట్ పర్యావరణ, స్పోర్ట్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్‌ర్యాలీని ఉక్కునగరం త్రిష్నా మైదానంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. లక్షలాది మొక్కలు నాటడం ద్వారా కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సైకిల్ ర్యాలీ ఉక్కునగరంలోని పలు సెక్టార్ల మీదుగా తిరిగి త్రిష్నా మైదానానికి చేరుకుంది. బాలబాలికలు పర్యావరణ ఆవశ్యకతను తెలియజేసే ప్లకార్డులతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గీత సహ కులాల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా చెల్లుబోయిన నాయుడు



అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు, నూతన కార్యవర్గ సభ్యులు

పెదగంట్యాడ: పారిశ్రామిక ప్రాంత గీత సహకులాల సంఘం అధ్యక్షుడిగా చెల్లుబోయిన నాయుడు ఎన్నికయ్యారు. పెదగంట్యాడలోని సంఘం కార్యాలయంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా నెల్లి సాధూరావు, ప్రధాన కార్యదర్శిగా వనుము నాగేశ్వరరావు, కోశాధికారిగా యలమంచిలి మంగరాజు, కార్య నిర్వాహణ అధ్యక్షుడిగా పితాని భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా దుంగ దేవన్‌రాజు, సిరట్ల వాసు, కార్యదర్శులుగా వనుము హనుమంతురావు, అండిబోయిన సన్యాసిరావు, సభ్యులుగా 30 మందిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో అధ్యక్షుడు చెల్లుబోయిన నాయుడు ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత సహకులాల వారంతా ఐక్యంగా ఉండాలని కోరారు. తద్వారా సామాజిక, రాజకీయ, ఆర్థిక ప్రగతి సాధించాలని పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గంలో వేల సంఖ్యలో తమ సామాజికవర్గానికి చెందిన వారు ఉన్నారని, వారంతా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని చెప్పారు. గీత సహకులాల వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జీతాల కోసం 'ఉక్కు' ఉద్యోగుల ఎదురుచూపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో నెలాఖరుకు జీతాలు చెల్లించేవారు. గత కొన్ని నెలలుగా జీతాలు ఎప్పుడు చెల్లిస్తారో అని ఉద్యోగులు ఎదురు చూడాల్సి వస్తోంది. గత నెలలో 21, 24 తేదీల్లో రెండు భాగాలుగా జీతాలు చెల్లించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సీఎండీని కలిసి జీతాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం మార్కెటింగ్ బాగున్నా జీతాల చెల్లింపుపై జాప్యం జరగడం పట్ల ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెలలో పిల్లల జీతాల చెల్లింపులు వంటి అదనపు ఖర్చులు ఉన్నందున జీతాలు ఎప్పుడిస్తారా అని ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షశిబిరంలో పాల్గొన్న మస్తానప్ప, పిట్టారెడ్డి, ఆదినారాయణ

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు, వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టా రెడ్డి కోరారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహించిన 1207వ రోజు దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు సొంత గనులు కేటాయించడం ద్వారా విశాఖ ఉక్కు పూర్వ వైభవానికి సహకరించాలన్నారు. తెలుగు ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం అంత సులభమైన విషయం కాదని గ్రహిస్తే మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్నేటి రమణ, నంది తాతారావు, భీమారావు, కటికల కల్పన, ఎస్.చంద్రశేఖర్, కె.ప్రభాకర్, పిట్టా సంజీవ్ రెడ్డి, గెద్దాడ అప్పలకొండ, పి.శంకరరావు, పి.నీలకంఠం, హరనాథ్, ఎం.వి.రమణ తదతరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం డీపీఎస్‌లో పెచ్చుమీరిన అక్రమాలు

పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆరోపణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

గాజువాక: ఉక్కునగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అవినీతి, అక్రమాలకు అడ్డులేకుండా పోతోందని ఆ పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.వి. సత్యనారాయణ, సభ్యురాలు వై.జ్యోత్స్న ఆరోపించారు. గాజువాకలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అడ్మిషన్లు మొదలుకుని పుస్తకాల కొనుగోలు, భవనాల నిర్మాణం, మరమ్మతులతోపాటు పాఠశాలలో ఉద్యోగాల భర్తీవరకు ప్రతి విషయంలోను అక్రమాలు పెచ్చుమీరాయ న్నారు. ఈ విషయంలో ప్రశ్నించినవారిపై కక్ష సాధింపునకు దిగుతున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం అడ్మిషన్లలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ఆ తరువాతే బటయవ్యక్తులకు కల్పించవలసి ఉంటుందన్నారు. దీన్ని కూడా పాటించడంలేదని చెప్పారు. ఉపాధ్యాయుల నియామకాల్లో కూడా అక్రమాలు జరుగుతున్నాయని, ఉపాధ్యాయుల భర్తీలో కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని తెలిపారు. అక్రమాలపై తాము ఎల్ఎంసీ కమిటీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పటికైనా ఈ విషయాలపై విచారణ నిర్వహించి అక్రమాలకు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ విజయం కోసం పూజలు



ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, విశాఖ పశ్చిమలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ విజయం సాధించాలని కోరుతూ జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జింక్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. నిరుపేదల ఇళ్లలో వెలుగులు నింపి వారి ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించిన మహానుభావుడు జగన్ అని కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ తక్కువ సమయంలో రూ. 220 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేసి చూపించారన్నారు. అలాంటి నాయకుడు వెంట పశ్చిమ ప్రజలు నిలిచారని, ఆయన భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కథలతో విజ్ఞాన సముపార్జన



విద్యార్థులకు కథలు వివరిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు

పెదగంట్యాడ: కథలను చదవడం ద్వారా విజ్ఞానాన్నిసముపార్జించుకోవచ్చని, అటువంటి కథలను విద్యార్థులు బాగా చదవాలని స్థానిక ఉపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు కథల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాల్లో కథలు చదివితే వాటిలోని నీతి అర్థమవుతుందని, మన నడవడిక బాగుంటుందని చెప్పారు.అనంతరం ఆటలు ఆడించారు గ్రంథాలయాధికారి పి.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 13 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నవ్వులు పంచిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు సుబ్రహ్మణ్యం, ప్రకాష్

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భానుప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అతిథులు దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, సూర్య, పూర్ణచంద్రరావు కళాకారులను సత్కరించి అభినందించారు.

అమర వీరుల త్యాగ ఫలితమే తెలంగాణ



వేడుకలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ వీరేశం, అతిథులు

ఉక్కునగరం: అమర వీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం అన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కు అధికారుల సంఘం (సి) భవన్‌లో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎన్. కుమారస్వామి, ప్రధానకార్యదర్శి జి.ఆనంద్, అధికారులు వేణుగోపాల్, బి.బాలాజి, చంద్రమౌళి, ఆర్.నరసింహ, జి.మల్లేశం, అసోసియేషన్ ప్రతినిధులు జె. శ్రావణ్‌కుమార్, ఎస్.బాలరామ్, ఎన్. నర్సింగరావు, సీహెచ్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరంలో పోటీలు

మల్కాపురం: సమాజంలో ఉన్న దురాచారాలను పోగొట్టడానికి పాటలు, సాంస్కృతిక అంశాలు ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ రచయిత కరుకు సత్తిరాజు అన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం చిన్నారులకు దేశభక్తి గీతాలు, జానపద గీతాలు, సామాజిక చైతన్య గీతాలు, సంప్రదాయ శాస్త్రీయ గీతాలు,చిత్రలేఖనం, దేశ నాయకుల జీవితచరిత్రలపై వ్యాస రచన తదితర పోటీలు నిర్వహించారు.ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థుల్లో మేథోశక్తి వెలుగు చూస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచి పెద్దల పట్ల ఎలా గౌరవంగా మెలగాలో వివరించాలన్నారు. చెడు స్నేహితులకు దూరంగా ఉంటూ మంచిని పెంచే పుస్తకాలతో స్నేహం చేస్తే అది జీవితానికి వెలుగు అనే బాట చూపుతుందన్నారు. జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ చేస్తున్న అర్చకుడు



నిత్య కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చనని వైభవంగా విర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను బేడా మండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అర్చకులు అందజేశారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ శిబిరం



శిబిరంలో నృత్యం నేర్చుకున్న చిన్నారులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కులో నెల రోజుల పాటు జరిగిన వేసవి నృత్య శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అకాడమీ నృత్యకారులు సుమారు 100 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు.

తెన్నేటి పార్కుకు మహర్దశ

- ఆధునికీకరణ పనులతో కొత్త శోభ
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



పార్కులో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ బెంచీలు, రెయిలింగ్



రంగులు వేసిన తెన్నేటి పార్కు ముఖ ద్వారం

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం తెన్నేటి పార్కుకు మహర్దశ పట్టింది. శిథిలావస్థలో ఉన్న పార్కు రూపురేఖలు ఆధునికీకరణ పనులతో మారుతున్నాయి. కైలాసగిరి దిగువన బీచ్ రోడ్డును ఆనుకుని తెన్నేటి పార్కు సందర్శకులకు అందుబాటులో ఉంది. కైలాసగిరికి వెళ్లే సందర్శకులు ఈ పార్కుకు కూడా వెళ్తుంటారు. తీరం చెంతన పార్కు ఉండడంతో ప్రజలు ఎక్కువ సమయం గడుపుతుంటారు. ప్రస్తుతం పార్కు శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్, ఫుట్‌పాత్‌లు పాడైపోయాయి. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు పార్కు ఆధునికీకరణపై దృష్టి సారించారు. దీంతో రూపురేఖలు మారుతున్నాయి. సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు. సందర్శకుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. శుద్ధి చేసిన తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పచ్చదనం కోసం లేన్‌లు అమర్చుతున్నారు. రెయిలింగ్ ఏర్పాటు చేసి రంగులు వేస్తున్నారు. సందర్శకులు కూర్చోవడానికి వీలుగా సిమెంట్ దిమ్మలు, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాటిపై కూర్చుని సందర్శకులు సముద్రం అలలను తిలకించవచ్చు. ప్రధాన ముఖ ద్వారానికి మెరుగులు దిద్ది కొత్తదనం తీసుకువచ్చారు. కొద్ది రోజుల కిందట చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకుని ప్రజలకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది.